విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

డిసెంబరు 16,17 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

విశాలాంధ్ర-ఏలూరు: చిన్నారుల్లో దాగివున్న వివిధ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు వారిలో మానసిక ఉల్లాసం, వికాసం పెంచేందుకు బాలోత్సవం ఎంతోదోహద పడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం హేలాపురి బాలోత్సవం నాల్గవ పిల్లల సంబరాలు పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరులో డిశంబరు 16,17 తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ బాలోత్సవాలు ప్రతి చిన్నారి వారి జీవితకాలమంతా ఈఅనుభవాలను వారి గుండెల్లో చెరగని ముద్రగా గుర్తుండేలా ఈ ఉత్సవాలను నిర్వహించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ డిశంబరు 16,17 తేదీల్లో ఏలూరు శ్రీసురేష్ చంద్ర బహుగుణ(పోలీసు) స్కూలు వేదికగా నాల్గవ హేలాపురి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు ప్రధాన కార్యదర్శి మ్యూజియం వి ఆర్ కృష్ణారావు నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు ఆహ్వాన సంఘం ఆఫీస్ బేరర్స్ స్నేహితులు వై.ఆనంద నాయుడు, శ్రీహరికోటి, ఎస్.కస్తూరి రావు, వి. సురేష్, పి. శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి. సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీగా మణి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అమలు చేయడంలో చురుకైన పాత్ర వహించాలని ఆశాఖ ఎడి గా బాధ్యతలు చేపట్టిన పి. రాకాడ మణి ని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో దివ్యాంగులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ ఎడిగా బాధ్యతలు చేపట్టిన పి. రాకాడ మణి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, మంచి సేవలు అందించి వారందరికి సంక్షేమ కార్యక్రమాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న పి. రాకాడ మణిని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా ఇటీవల ప్రభుత్వం నియమించింది.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్టోబర్ 27వ తేదీన ప్రచురణ చేసిన ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురించడం జరిగిందని దీనిపై ప్రజలు వారి వారి ఓటు ఉన్నదో లేదో చూసుకొని ఏమైనా తేడాలు ఉన్నట్లయితే మార్పులు చేర్పులు చేసుకోవచ్చని నిడమర్రు తహసిల్దార్ బి. సాయిరాజ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 4, 5 తేదీల్లో డిసెంబర్ 2, 3 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రాల్లో తమ ఓటును చూసుకోవచ్చని ఆయన తెలిపారు. ఉదయం10 గంట ల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ స్టేషన్లు వద్ద అధికారుల అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ప్రజలు ఓటర్ జాబితాలో తమ పేర్లు ఉన్నది లేనిది పరిశీలించుకోవాలని ఆయన తెలిపారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. శుక్రవారం పేట కలిదిండిలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత సమాజానికి విద్యార్థి దశ నుంచే సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడి అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి అన్నారు. అవినీతి రహిత నిర్మూలన మన దేశ ప్రగతి పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ తేజ, పాఠశాల హెచ్‌ఎం రాజా మోహన్, బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెబుదాంలో 132 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర-కామవరపుకోట: మండల స్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించేందుకు మండల స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం(జేకేసీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి పేర్కొన్నారు. శుక్రవారం జంగారెడ్డి గూడెం డివిజన్ కామవరపుకోట మండలానికి సంబంధించి జేకేసీ కార్యక్రమాన్ని స్థానిక శ్రీ చిన రాజప్ప ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య, ప్రత్యేక అధికారి ఎం. రాజు, డ్వామా పిడి. రాంబాబు డిపిఓ టి. శ్రీనివాస్ విశ్వనాథ్‌లతో కలిసి కామవరపుకోట మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా స్థాయి అధికారులు అందరూ మండల స్థాయి జేకేసీ కార్యక్రమానికి కూడా హాజరవడం ద్వారా మండల స్థాయి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కడిమి రమేష్, యడవల్లి సర్పంచి పొన్నాల అనిత , తహసీల్దార్ సత్యనారాయణ, యంపిడిఓ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పరిశీలనకు సీస్ సర్వే

విశాలాంధ్ర-టీ నరసాపురం: విద్యార్థుల్లో దాగి వున్న విద్యా సామర్థ్యాల పరిశీలనకు సీస్ సర్వే నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖాధి కారి టి. రామ్మూర్తి తెలిపారు. మండలంలో విద్యాశాఖాధికారులు టి. రామ్మూర్తి, ఎస్.కళ్యాణిల పర్యవేక్షణలో సీస్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ మండలంలో 3,6,9 తరగతులు చదివే విద్యార్థులకు 22 పాఠశాలల్లో 32 తరగతులకు 32 ఫీల్డ్ ఇన్విజిలేటర్ల సహాయంతో పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: సార్వత్రిక ఎన్నికలు 2024 నేపథ్యంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్, ఎస్ పి లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పి యు.రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మూడు విభాగాలతో కూడిన రక్షణ దళాలను ఉపయోగించినట్టు తెలిపారు. ప్రస్తుతం రానున్న సార్వత్రిక ఎన్నికలలో కూడా ఇదే విధంగా రక్షణ దళాలను ఏర్పాటు చేయడంతో పాటు, మరో నాలుగు విభాగాలను కూడా రక్షణ దళాల సేవలకు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని ఆమె వివరించారు. 782 మంది రక్షణ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహణకు కొరతను జిల్లా ఎస్పీ గుర్తించారని, వారి స్థానంలో రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్ లు, ఎన్ సి సి, మహిళా పోలీస్ తదితరుల సేవలను ఉపయోగించుకునేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నామని ఆమె వివరించారు. 434 సెక్యూరిటీ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్‌కు సంబంధించి 392 వాహనాలకు ప్రతిపాదించగా ఇంతవరకు తమకు అందుబాటులో ఉన్న వాహనాలు పూర్తి వివరాలతో కూడిన నివేదిక త్వరలోనే సమర్పిస్తామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్నేహపూరిత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను జరిపేందుకు గత ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నామని, వాటికి అనుగుణంగా సిబ్బందిని కూడా నియమించడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఉండే భవనాలను గుర్తించడం జరిగిందని, వాటిలో ఎక్కువ శాతం పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 4 , 5 శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను ఫారం 6, తొలగింపులకు ఫారం 7, మార్పులు, చేర్పులకు ఫారం 8 లను స్వీకరించడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్య నారాయణ రాజు తెలిపారు. స్థానిక ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం పోలవరం నియోజకవర్గ పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వర రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో లో 99 శాతం హామీలు అమలు చేసిన ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డి అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత జగన్మోహనరెడ్డికే దక్కుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు,దేవరపల్లి ముత్తయ్య, తుమ్మూరి శ్రీనివాస్ రెడ్డి, వంటి పల్లి వెంకటేశ్వరరావు ,ఉమ్మడి తేజ, కురసం నిరీక్షణ రావు, సర్పంచ్ లు ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ముసునూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో నూతనంగా నిర్మించే భవనాలను వేగవంతంచేసి త్వరగా నిర్మించాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ మండల శాఖాధికారులను కోరారు.శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్,రైతు భరోసా కేంద్రం ,గోపవరం గ్రామంలోని గ్రామ సచివాలయం,వేల్ నేస్ సెంటర్ ,రైతు భరోసా కేంద్రం,మండలకేంద్రమైన ముసునూరులో రైతు భరోసా కేంద్రం,సచివాలయం,వేల్‌నేస్ సెంటర్ లను ఎంపిడిఒ జి.రాణి, ఏఇ దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ సిబ్బందితో కలిసి ఆయా భవనాలను పరిశీలించి,ఆయా కాంట్రాక్ట్ దారులతో మాట్లాడి త్వరగా భవన నిర్మాణాలను పూర్తిచేయాలని ఆదేశించారు.

చలో హైదరాబాద్ గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : చలో హైదరాబాద్‌కు మాదిగల విశ్వరూప మహాసభకు మాదిగలంతా తరలి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కొయ్యల గూడెంలో చలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యం.ఆర్. పి.ఎస్. నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే విశ్వరూప మహాసభకు మాదిగ సోదరులంతా కలిసి రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా యం.ఎస్. పి.అధ్యక్షులు చనమంద్ర కనకరాజు, పోలవరం యం.ఎస్.పి.ఇన్‌చార్జి బొబ్బర ఎలీషా, లంక జయ బాబు, బుట్టాయిగూడెం మండల యం . ఎస్. పి.శివాజీ, పోలవరం యువజన అధ్యక్షులు దొండపాటి బాలు మహేంద్ర, టి. నర్సాపురం మండల యం.ఆర్. పి.ఎస్.ఇన్‌చార్జి బి.సత్యనారాయణ, ఏలేటి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెం వ్యవసాయ సహకార సంఘం ద్వారా రూ. 50 కోట్ల మేర వ్యాపారాభివృద్ధి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ తెలిపారు. ఈ సహకార సంఘ అభి వృద్ధిపై కార్యదర్శి ప్రకాశ రావు, సిబ్బందితో సమీక్షించారు. 2 వేల 200 మంది మెంబర్లున్న ఈ సహకార సంఘంలో 2021 ఆగస్టు నుంచి 2023 వరకు రూ. 15 కోట్లు దీర్ఘకాలిక రుణాలు అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది రబీలో రూ. 2 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, దీనిలో భాగంగా ఇప్పటికి రూ. 50 లక్షలు రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. సంఘ పరిధిలో కాకుండా అన్ని పత్రాలు ఉండి అర్హులైన వారికి రుణాలు ఇస్తున్నట్టు వివరించారు. ఈ ఏడాది వ్యవసాయ రుణాలు రికవరి 95 శాతం ఉందని, దీర్ఘకాలిక రుణాల రికవరి 60 శాతం ఉందని అన్నారు. సంఘ పరిధిలో బంగారంపై రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటు న్నామని, అనుమతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. దీనికోసం స్ట్రాంగు రూము నిర్మించాల్సి ఉందని తెలిపారు. గోదాము నిర్మాణానికి అనుమతులకు ప్రతిపాదనలు పంపామని అన్నారు. సంఘంలో రూ. 50 కోట్లు వ్యాపారాభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.

స్వమిత్వకు సహకరించండి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో చేపట్టిన స్వమిత్వ కార్యక్రమానికి తమవంతు బాధ్యతగా ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.మల్లికార్జున రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన భీమవరంలో మీడియాకొక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామకంతం భూముల్లో ప్రభుత్వ ఆస్తులు, వ్యక్తిగత ఆస్తులు, ఖాళీ స్థలాల వివరాలు గ్రౌండ్ ట్రూతింగ్‌కు సర్వే అధికారులు వచ్చినప్పుడు ప్రజలు తమ వద్దనున్న డాక్యుమెంట్ నకళ్లను అందచేసి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కోరారు.

ప్రతి నెల1వ తేదీన పెన్షన్ ఇవ్వాలి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ పెన్షనర్స్ కు ప్రతినెల మొదటి తేదీనే పెన్షన్ ఇవ్వాలని, బకాయిపడిన డిఎ అరియర్స్ చెల్లించాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర పిలుపుమేరకు శుక్రవారం విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు స్థానిక కోట దిబ్బ వద్ద గల సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి ఏటిఓ జి. సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 11వ పిఆర్సి బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్సికి ఐఆర్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి కె. మహాలక్ష్ముడు, కోశాధికారి డి. గంగాధర్, నాయకులు ఇబ్రాయిల్, మాస్టర్ ఆర్. వెంకటేశ్వర్లు, ఎన్. మధుసూదనరావు, ఏలూరు నగరపాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఎ. అప్పలరాజు, ఎస్‌ఎంవి సుబ్బారావు, ఎన్. ఏసు, బి. పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా , కడపలో ఉక్కు కర్మాగార నిర్మాణం చేపట్టాలనే డిమాండ్స్ పై ఈనెల 8 వ తేదీన జరిగే కేజీ టు పీజీ విద్యా సంస్థల రాష్ట్ర వ్యాప్త బంద్‌కు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అధినేతలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఏఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ ఎఫ్ ఐ, డివైఎఫ్ఐ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. శుక్రవారం సిపిఐ పట్టణ కార్యాలయం కపర్ది భవన్‌లో బుధవారం విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి. అప్పలస్వామి,ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి. పెద్ది రాజు , పిడిఎస్ యున్ జిల్లా అధ్యక్షులు ఎం.రూపా శంకర్ , డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి. ధనుష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం ఈనెల 8 కి వెయ్యి రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ చేస్తున్నామని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం వలన వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పింపబడతాయన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం చేసే పోరాటంలో విద్యార్థి యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డి పవన్ , జీ రాజేశ్ ఏ ఉతేజ్ , ప్రణీత్ , కే మనోజ్ , పిడిఎస్ యు నాయకులు ఎన్ శ్రీనివాసరాజు , ఎస్ ఎఫ్ ఐ నాయకులు జీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దీనిపై విద్యార్థులు ప్రజల్లో అవగాహన కలిగించాలని ప్రముఖ నేత్ర వైద్యులు అంధ పాఠశాల నిర్వాహకులు డాక్టర్ యు.వి. రమణరాజు అన్నారు. ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ కళాశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవాల వేడుకలను పురస్క రించుకుని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. టూ టౌన్ ఎస్ఐ జి.ఫణి మోహన్ మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ఎస్.ప్రసున మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో మొక్కలను శ్రద్ధగా పెంచి స్వర్ణోత్సవాలకు జ్ఞాపికగా ఉంచా లన్నారు. కార్యక్రమంలో స్వర్ణోత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీకాంతం, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ పి.అరవింద స్వామి, డాక్టర్ పి.రాజశేఖర్, అధ్యాప కులు సత్యనారాయణ, పి.అమూల్య రావు, రామభద్రిరాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయుక్తంగా పిఎసిఎస్‌లు

విశాలాంధ్ర - కలిదిండి : రైతులకు ఉపయుక్తంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని కేడీసీసీ చైర్మన్ తాతినేని పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని కొచ్చర్ల గ్రామంలో రూ 26.50 లక్షలతో నిర్మించిన నూతన పిఎసిఎస్ భవనాన్ని ఎమ్మెల్సీ జయ మంగళ. వెంకటరమణ తో కలిసి రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించి వారి అభివృద్ధికి పిఎసిఎస్ లు దోహదపడుతున్నాయన్నారు. తీసుకున్న రుణాల ను రైతులు సకాలంలో చెల్లించి పిఎసిఎస్ లను అభివృద్ధి పథంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో దూలం వీర శ్యామ్ ఫణి కుమార్, జడ్పిటిసి బొర్రా సత్యవతి, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కనకదుర్గ రాణి, సర్పంచి ఆల రాము, ఎంపీటీసీ నరహరిశెట్టి. విజయలక్ష్మి, సంబూరు శ్రీదేవి, సయ్యపురాజు గుర్రాజు, త్రిసభ్య కమిటీ సభ్యులు దాసరి చార్లెస్, కర్రి సోమశేఖర రావు, నరహరిశెట్టి సులోచన, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బోరు నిర్మాణం

విశాలాంధ్ర - లింగపాలెం : శింగగూడెం జగనన్న కాలనీలో నీటి వసతి కల్పించేందుకు బోరు వేశారు. దాదాపు రూ. 5.50 లక్షలతో దీని నిర్మాణం చేస్తున్నారు. బోరు వేసి విద్యుత్ అమర్చి మోటారు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కోటగిరి వాణి హరీష్‌బాబు, కోటగిరి ధీరాజ(చినబాబు), సొసైటీ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వరరావు, సేవా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పరిశోధనలతో నవశకానికి నాంది పలకాలి

- ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెంరూరల్: వినూత్న పరిశోధనలతో నవశకానికి నాంది పలకాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న టెక్రియా 2023 ఆరంబ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీవి వీరేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు దేశానికి దిక్సూచి వంటివని, విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణ లకు రూపకల్పన చేయవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో అత్యాధునిక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, వాటికనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టులను రిజిస్ట్రార్ పరిశీలించి, వాటి వివరాలు, ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమతో రైతులకు మేలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : నీటిపారుదల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా పోలవరం మండలంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేయడం పట్ల నేడు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కన్వీనర్ బొరగం శ్రీనివాస్, పోలవరం వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారెపల్లి రామారావు, కొయ్యలగూడెం మండల తెదేపా అధ్యక్షుడు పారేపల్లి నరేష్, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహా రాన్ని తీసుకోవాలని గణప వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ ఆర్ ఎస్ సంతోష్ నాయుడు అన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో గణపవరం సచివాలయం 3లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 191 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె. విల్సన్‌బాబు మాట్లాడుతూ సంవత్సరం లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, ప్రతి బుధ, శనివారాల్లో ఆయా గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎంఎస్ యోహాన్, ఎ. కృష్ణ, ఎం. ప్రేమలీల, ఎంఎల్‌హెచ్‌పి నున్న పాపా, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ అమరావతి వారి ఆదేశాల ప్రకారం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రెనింగ్,ద్వారా మండలంలో అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న 73 పాఠశాలల్లో 31 పాఠశాలలకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే ను నిర్వహించినట్టు మండల విద్యాశాఖ అధికారి సురేష్ బాబు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలలో ఉన్న 73 పాఠశాలల్లో రాండమ్ పద్ధతిలో 31 పాఠశాలలను ఎంపిక చేసి సదరు పాఠశాలలో 3వ,6వ, 9వ తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లీష్, సబ్జెక్టులలో వారి సామర్థ్యాల స్థాయిని అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ జరుగుతున్న పాఠశాలలను ఎంఈఓ సురేష్ బాబుతో కలిసి ఎంఈఓ - 2సిహెచ్ వెంకటేశ్వరరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుజి ఏ సి హెచ్ పి కుమార్, ఎస్.ఉమాదేవి, కే. రవికుమార్,బి.రామారావు,ఎం. సుజాత, సీఆర్పీలు,ఫీల్డ్ ఇన్వెస్ట్ గెటార్లుగ ఇందిరా దేవి బిఈడి కళాశాల విద్యార్థులు వ్యవహరించినట్టు ఎంఈఓసురేష్ బాబు పేర్కొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీజీజీబీ విజిలెన్స్ అధికారి ఇ. రాంబాబు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాలను పురస్క రించుకొని ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులకు తెలిపారు. సమాజంలో బాధ్యతలను సక్రమంగా నిర్వహించక పోవడం కూడా అవినీతిగానే భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీజీజీబీ ప్రధాన కార్యాలయం విజిలెన్స్ అధికారి విజయ్ కుమార్, రీజనల్ మేనేజర్ మల్లేశ్వరరావు, మేనేజర్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-కామవరపుకోట : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి అన్నారు. శుక్రవారం కామవరపుకోటలో చిన్న రాజప్ప ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలు తెలియజేశారు. మొత్తం 126 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో భూములకు సంబంధించి రెవెన్యూ పరిధిలోని ఎక్కువ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆర్డీవో పద్దయ్య, స్పెషల్ ఆఫీసర్ ఎం. రాజు, పిడి ఏ. రాము, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కే. శ్రీదేవి, జెడ్పీటీసీ కడిమి రమేష్, పొన్నాల అనిత తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర ఏలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు ప్రణాళికబద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు.శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో, జిల్లా ఎస్.పి లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్, చెక్ పోస్టు ల ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై రాబోయే ఎన్నికలకు సంబంధించి సమగ్ర వివరాలు ముందస్తు ఏర్పాట్లపై జిల్లాల వారీగా

ఆయన సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ఎస్ పి డి. మేరీ ప్రశాంతి, డిఆర్ఓ యం. వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎన్నికల నిర్వహణకు మానవ వనరులు, ఎన్నికల సమాగ్రి, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్, సి విజిల్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్, తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఎన్నికల నిర్వహణకు మూడంచెల భద్రతా ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.జిల్లా ఎస్ పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు స్టేట్ ఫోర్స్ నియామక ప్రణాళిక, స్ట్రాంగ్ రూం, రిసెప్షన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సెక్యూరిటీ ప్లాన్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు.

సమిష్టి కృషితో దోమల నివారణ

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : వైద్యుల సూచన సలహాలతో పాటు గ్రామస్తులు, పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమిష్టి కృషితో నివాసిత ప్రాంతాల్లో దోమల నివారణ చేయవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర

పరిధిలోని అప్పారావుపేట, వెంకటరావుపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే కార్యక్రమం జరిగింది వెక్టార్ కంట్రోల్ హైజీన్ మరియు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించారు ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణ రావు మాట్లాడుతూ సిబ్బంది గృహసందర్శనాలలో ఇంటివద్ద నెలకొని ఉన్న అపరిశుభ్ర వాతావరణం ను దానివల్ల వచ్చే అనారోగ్య పరిస్థితులుపై ప్రజలకు అవగాహన,కలిపించారు లార్వా ను ప్రజలు గుర్తించుట లోచైతన్య వంతులు చేయాలని పిలుపు నిచ్చారు. వారానికి ఒక సారి డ్రై డే పాటించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఆరోగ్య పరీక్షలు నిర్ధారణ పరీక్షలు డా.వై.ఆర్.గ్రామ ఆరోగ్య క్లినిక్ లో చేస్తారని వాటిని అందరూ సద్వినియోగ పర్చు కోవాలని సూచించారు ఆరోగ్యవంతమైన సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నివాసితు ప్రాంతాల్లో మురుగునీటి నిలవలు లేకుండా జాగ్రత్త వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎం.ఎల్. హెచ్.జ్యోతి, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు ,ఆరోగ్య సహాయకులు బాబ్జీ, కాంతారావు,అంగన్వాడి కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేత

విశాలాంధ్ర-పోడూరు : మండలంలోని తూర్పు పాలెం, జగన్నాథపురం గ్రామాల లోని లబ్ధిదారులకు జిల్లా వైసీపీ అధ్యక్షులు ఆచంట శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇళ్ల పట్టాలు

అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఏ రాష్ట్రం లోనూ లేని విధముగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు పాలెం గ్రామ సర్పంచ్ గుబ్బల ఉషారాణి వీరబ్రహ్మం, జగన్నాథపురం గ్రామ సర్పంచ్ గుడాల శిరీష చంటి, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వాసు రెడ్డి, ఎంపీటీసీలు అధికారులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైయస్ఆర్ జలకళ ద్వారా మోటార్ల పంపిణీ

విశాలాంధ్ర- పెదవేగి: పెదవేగి ఎండీఓ కార్యాలయం వద్ద వైయస్ఆర్ జలకళ ద్వారా అర్హులైన రైతులకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ వైయస్ఆర్ జలకళ కార్యక్రమం ద్వారా రైతులకు ఉచిత బోర్లు వేసి ప్రతి ఎకరా సాగు

భూమికి సాగునీరు అందించడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం బోర్‌వెల్ లేని, 2.5 ఎకరాల భూమి ఉన్న రైతులు ఎవరైనా అర్హులని పక్కపక్కనే 2.5 ఎకరాల భూమి భూమి ఉన్న రైతులు ఒక గ్రూప్ గా ఏర్పడి ఉచిత బోర్‌వెల్ పొందేందుకు కూడా ఈ పథకంలో అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్న , సన్నకారు రైతులకు ఎస్సి, ఎస్టి మహిళా రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. జలకళ ద్వారా లబ్ది పొందిన రైతన్నలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మొదటిగా గెలుచుకునే స్థానం పాలకొల్లు

విశాలాంధ్ర-పాలకొల్లు: రాష్ట్రంలో వైకాపా మొట్టమొదట గెలిచే స్థానంగా పాలకొల్లు ఉంటుందని ప్రభుత్వ విప్, వైసీపీ సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. పాలకొల్లులో శుక్రవారం జరిగిన పాలకొల్లు రూరల్ మండల, వైసీపి నాయకులు, కార్యకర్తల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టిడిపి

కంచుకోటగా పిలవబడే పాలకొల్లులో వైసిపి గెలుస్తుందంటూ అప్పి రెడ్డి వ్యాఖ్యలు చేయడంతో సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ గుడాల గోపి, టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, వైసీపీ పాలకొల్లు మండలం నూతన కన్వీనర్ విప్పర్తి ప్రభాకర్ రావు, యలమంచిలి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, దత్తాత్రేయ వర్మ, డిటిడిసి బాబు, జమ్ము బుజ్జి, గుంటూరి పెద్దిరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్త్రీ,శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు పోస్టులు

విశాలాంధ్ర -భీమవరం: ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ విభాగంలో ఏడాది ప్రాతిపదికన కాంట్రాక్టు పద్ధతిలో పలు పోస్టలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారత శాధికారి బి.సుజాతరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లో డిస్ట్రిక్టు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఒక పోస్ట్), ప్రొటెక్షన్ ఆఫీసర్, ఇనిస్టిట్యూట్ (ఒక పోస్ట్), ప్రొటెక్షన్ ఆఫీసర్, నాన్ ఇనిస్టిట్యూట్ (ఒక పోస్ట్), లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఒక పోస్ట్), సోషల్ వర్కర్ (ఒక పోస్ట్), డేటా ఎనలిస్టు (ఒక పోస్ట్), అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ (ఒక పోస్ట్), ఔట్ రీచ్ వర్కర్సు (మహిళ) (రెండు పోస్టులు) ఉన్నాయన్నారు. స్పెషలైజుడు అడాప్షన్ ఏజన్సీ యూనిట్లో మేనేజర్/కోఆర్డినేటర్ (ఒక పోస్ట్), సోషల్ వర్కర్/ఎర్లీ ఉమెన్ (ఒక పోస్ట్), నర్సు(మహిళ) (ఒక పోస్ట్), డాక్టర్ (మహిళ) (ఒక పోస్ట్), ఆయాలు(ఆరు పోస్టలు), చౌకీదార్ (మహిళ) (ఒక పోస్ట్), ఖాళీలున్నాయని మరిన్ని వివరాలకు " వెస్టుగోదావరి.ఎపి.ఇన్. " వెబ్ సైటులో సందర్శించవచ్చని ఆమె వివరించారు. దరఖాస్తులను నవంబర్ 10వ తేదీలోపు సదరు వెబ్ సైటులో అప్ లోడ్ చేయాలని, నోటిఫికేషన్ రద్దు చేయడానికి, మార్పులు చేయడానికి జిల్లా కలెక్టర్ వారికి అధికారాలున్నాయని ఆమె తెలిపారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో కోనసీమ తిరుపతి వాడపల్లిలో వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి, ఆండాళ్ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాలు రెండవ రోజు కావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన స్వామి సేవలు అభిషేకానంతరం స్వామి వార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి రమేష్ రాజు ఆధ్వర్యంలో ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో అర్చకులు వేద పండితులు ఆగమ శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలను మేళతాళాలు, వేదమంత్రాలు, అశేష భక్త జనసందోహం నడుమ అత్యంత వైభవంగా ప్రారంభించారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చి దిద్దారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన,,ప్రధాన హోమములు, గోదావరీ నదీ జల సంగ్రహణ,మహా స్నపనము, లక్ష కుంకుమార్చన, నీరాజము, మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 5:01ని.లకు స్వస్తి వాచనము, ప్రధాన హోమములు, మహా లక్ష్మీ హోమము, దిగ్ దేవతా బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ. ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీపాలు కాంతులతో పూల దండల అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి స్వామి వారు "హంసహంస వాహనం" పై భక్తులకు దర్శనమిచ్చారు. చిర్ల జగ్గిరెడ్డి, ప్రభుత్వ విప్ శాసన సభ్యులు ఆధ్వర్యంలో అఖిలాండ బ్రహ్మాండనాయకుడు వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు.

జగన్‌కు పరాభవం తప్పదు

విశాలాంధ్ర - గోకవరం: బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోకవరం టౌన్ లో గోకవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మంగ రౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన బాబు షూరిటి భవిష్యత్తు గ్యారెంటీ మహాశక్తి కార్యక్రమంలో

రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు, కంచుమర్తి రాఘవ ముఖ్య అతిధిలుగా పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మినీ మేనిఫెస్టో లోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశక్తి చైతన్య రథయాత్ర కు ప్రజల నుండి విశేష స్పందన లభించింది అని తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి లబ్ది చేకూరుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గునిపే భరత్, కోట సత్తిబాబు, మేడిశెట్టి వీరబాబు, స్టూడియో రాజ్, అడబాల సింగరయ్య, దిండి రాజు తితరులు పాల్గొన్నారు.

కాపునాడు అధ్యక్షుడికి అభినందనలు

విశాలాంధ్ర - అయినవిల్లి : పి గన్నవరం మండల కాపునాడు అధ్యక్షుడుగా నియమితులైన తోట శ్రీనివాసరావుకు కె. జగన్నాథ పురంకు చెందిన ప్రముఖ సంఘసేవకుడు, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ళ శ్రీనివాస్

అభినందనలు తెలిపారు. తోట శ్రీనివాసరావు కాపుల అభ్యున్నతి, సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేయాలని ఆయన కోరారు.

రాక్షసపాలన అంత మొందించడమే ధ్యేయం

విశాలాంధ్ర - అనపర్తి : రాక్షస పాలన అంత మొందించాలని ఇటు టిడిపి, అటు జనసేనతో పాటు ప్రజలు ఎదురు చూస్తున్నారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఆర్

కళ్యాణ మండపంలో టిడిపి,జనసేన నియోజకవర్గ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు కెఎస్ జవహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం టిడిపి, జనసేన కలిసి ఐక్యతగా ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. టిడిపి జనసేన కలిసి రాష్ట్రంలో 175 సీట్లకు 175 సీట్లు గెలవడం ఖాయమని ఇందులో ఎటువంటి సందేహం లేదని జవహర్ జోస్యం చెప్పారు. నియోజవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన శ్రేణుల మధ్య ఎటువంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసి సైకో పాలనకు స్వస్తి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధా కర్ రెడ్డి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, జనసేన నేతలు రావాడ నాగు, ఎన్ రామకృష్ణ ప్రసాద్ రెడ్డి, ఇతర టిడిపి, జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన జనబాటకు బ్రహ్మరథం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణంలో జనసేన చేపట్టిన జన బాట కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్థానిక చిన్న వీధిలోని మోటూరి నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన బాట కార్యక్రమానికి పెద్దాపురం నియోజవర్గ

జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మల బాబు పాల్గొని ప్రజా సమస్యలపై ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల బాబుకు పలువురు మహిళలు హారతులు పట్టి పూలు జల్లి స్వాగతం పలకగా ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు సరోజా, వాసు, జనసేన నాయకులు పిట్టా జానకిరమారావు, మంచెం సాయి, తుమ్మల ప్రసాద్, మడగల శ్యాం కుమార్, బిక్కిన రాజాశేఖర్, సఫీయుల్, కంచుమర్తి రాజన్న, వోబిలిశెట్టి గణేష్, పోలినాటి గౌతం అభిషేక్, చిటికెల నారాయణమూర్తి, వీర మహిళలు పెంకే వెంకటలక్ష్మి, మంగతాయారు తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఆంధ్రప్రదేశ్ ఆదేశానుసారం, శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసిల్దార్ జి. కనకరాజు తెలిపారు. మండలంలోని 58 పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 గంటల నుండి ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఓటు నమోదు, తొలగింపు, సవరణ తదితర కార్యక్రమాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఓటర్లు తమ ఆధార్ డేటాను, ఓటర్ ఐడి కార్డుతో అనుసంధానం చేసుకొనుట కొరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జనవరి 1 2024 సంవత్సరానికి, 18 నిండి, మండలానికి చెందిన ప్రతి పౌరుడు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర - గోకవరం: గోకవరం మండలం ఠాకూర్ పాలెం గ్రామానికి చెందిన వేలంపర్తి చిన్నయ్య దొర ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయినందున ఆ కుటుంబాన్ని ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్ సర్పంచి నాగేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పరామర్శించారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెం, గ్రామ రజకుల సంఘం ఆధ్వర్యంలో పునఃనిర్మిస్తున్న సంపత్ శ్రీ వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేశారు. పాత ఆలయం

శిథిలావస్థకు చేరుకోవడంతో పది లక్షల రూపాయల టీటీడీ గ్రాంట్ తో నూతన ఆలయ నిర్మాణానికి అంకురార్పణ చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి పెదపోలు వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ నందిగం భాస్కర రామయ్య, మండల జె సి ఎస్ ఇంచార్జ్ కఠారి సిద్ధార్థ రాజు, గ్రామ నాయకులు వల్లేపల్లి రాజా,పిచ్చుకల రాఘవయ్య, నందిన శ్రీనివాస్, కమిటీ పెద్దలు దువ్వాపు పుల్లయ్య, నందమూరి నాగరాజు, అడప శ్రీరామమూర్తి, కంతేటి చిన్నయ్య, పొన్నాడ రాము, కార్యకర్తలు, గ్రామ ప్రజలు భక్తులు, సచివాలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనబాట పట్టిన జనసేన, టిడిపి

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో జనసేన, తెలుగుదేశం పార్టీలు షణ్ముఖ వ్యూహంతో ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, జనసేన పార్టీ నాయకురాలు కాకినాడ మాజీ మేయర్ కవి కొండల సరోజ, మండల నాయకులు బండారు మురళి, భోగి రెడ్డి గంగాధర్, కొండబాబు, బుంగ సింహాద్రి, కాకర్ల బుజ్జిబాబు, పలివెల జానకి రామయ్య, కోటగిరి మహేంద్ర బాబు, జయేంద్ర బాబు, మహేష్, పంపన కన్నారావు, సుకుమార్, బొజ్జా భవాని, నక్క అంజి, యాళ్ల పండు, దేవు జమీందార్, వీరం రెడ్డి ముత్యాలరావు, పేపకాయల పవన్ కుమార్, చుండ్రు వెంకన్న రావు చౌదరి, గుల్లిపల్లి శ్రీనివాసరావు, మట్ట ప్రకాష్ గౌడ్, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, మల్లేశ్వరరావు, తదితర నాయకులు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేసారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను తయారు చేసి ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామని మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి తెలిపారు.

టీడీపీలోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-కొవ్వూరు : తెలుగుదేశం పార్టీలోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభించేదని నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంటమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూర పని చిన్ని

పేర్కొన్నారు. పట్నంలోని ఏడవ వార్డు పరిధిలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తెదేపా నాయకులు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వార్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

షిర్డీ సాయి విద్యార్థికి రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి

విశాలాంధ్ర - ఆలమూరు : హైదరాబాదుకు చెందిన మన సంస్కృతి సంస్థ వారు ఆంధ్రా తెలంగాణ రాష్ట్రాలలో నిర్వహించిన తెలుగు, హిందీ ప్రతిభా పోటీ పరీక్షలలో ఆలమూరు మండలంలోని చెముడులంక గ్రామంలో శ్రీ షిరిడి సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఎనిమిదో

తరగతి చదువుతున్న విద్యార్థిని అడబాల ప్రణవి నాగదేవి తెలుగు విభాగంలో ఉభయ రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ మేరకు హైదరాబాద్ తిలక్ రోడ్‌లో గల తెలంగాణా సారస్వత పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రవిణకు మేమెంటో సర్టిఫికెట్లను అందజేశారు. తెలుగు పట్ల ఆసక్తి కనబరచడంతో ఆ పాఠశాల చైర్మన్ ఉమారాణి, గ్రామ సర్పంచ్, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్‌తో పాటు పలువురు అభినందించారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి పోయిందని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలన్న తిరిగి అభివృద్ధిలోకి తీసుకు రావాలన్న చంద్రబాబుతోనే సాధ్యమని రాజానగరం

నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టే మేనిఫెస్టో కార్యక్రమాలు ప్రజలకు శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి గెలవాలని తద్వారా రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. విజన్ ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి దొరకాలి అంటే టిడిపి అధికారం రావాలని తద్వారానే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్ గ్యారంటీ అని అన్నారు. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించి మీ పిల్లలు భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగిశెట్టి చంటి బాబు, కందులు బాబు రాయుడు, వంక మల్లి బాబు, బుడ్డిగ అప్పారావు, బచ్చు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. నేలనంటిన వరిచేలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరులో గత రెండు రోజులుగా మధ్యాహ్నం సమయంలో అకాల భారీ వర్షం పడుతున్నది. దీంతోపాటు వీచిన ఈదు రుగాలులకు చేతికొచ్చిన పంట నేలవాలింది. అక్కడక్కడా పాలుపోసుకున్న పంట నేలనంటింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొమ్మేరులో నష్టం ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.మరో

పది రోజుల్లో పంట కోతకొచ్చే సమయంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షంతో దొమ్మేరు పరిసర ప్రాం తాల్లో చాలా వరకు పంట నేల వాలింది. నేలవాలిన పంటను మిషన్‌తో కోత కోయడానికి రైతుకు అదనంగా రూ. 5 నుంచి 6 వేలు వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు. దీనికి తోడు దిగుబడి తగ్గి పంట నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.మరి కొన్నిచోట్ల కళ్ళాల్లో ఆరబెట్టిన ధాన్యం కూడా తడిచిపోయింది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు కె.వి.కె రంగారావు డిమాండ్ చేశా రు.దీనిపై కొవ్వూరు వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల్లో పంట నేలవాలినట్టు సమాచారం ఉందని తెలిపారు. రైతులు మా త్రం వంద ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అందరికీ న్యాయం

కేంద్ర మాజీ మంత్రి పళ్ళంరాజు

విశాలాంధ్ర - కాకినాడ : కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రాష్ట్రంలో అందరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు ఎంఎం పళ్ళంరాజు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ

సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన హాజరైన పళ్ళంరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ద్వారా లభించిన ఓటుహక్కు సద్వినియోగం చేసుకుని మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. ఎన్నుకున్న వ్యక్తి సిద్ధాంతపరంగా కట్టుబడి ఉన్నారా లేదా గమనించాలని అన్నారు. కాంగ్రెస్ పాలనా కాలంలో కేవలం సంక్షేమం మాత్రమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ప్రజల మనోభావాలకు బీజేపీ విలువ ఇవ్వడం లేదని, అన్ని వ్యవస్థలను పూర్తిగా దుర్వినియోగం చేస్తుందని బిజెపిపై పల్లంరాజు మండిపడ్డారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆకుల లలిత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ, నగర అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజు, ఎంపీటీసీ ఇంటి వీరభద్రరావు, పెద్దాడ సుబ్బారాయుడు నాయకులు మల్లిపూడి శ్రీరామమూర్తి, కోలా ప్రసాద్ వర్మ, తుమ్మల దొరబాబు, తుమ్మలపల్లి వాసు, ఎం అనూష, దవులూరి ధనకోటి, బండారు జయ ప్రకాష్ పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఫుల్... అభ్యర్థులు నిల్

ప్రచార లోపమే కారణం

విశాలాంధ్ర - రాజానగరం : గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, అర్థాంతరంగా చదువు మానేసిన యువకులకు అవగాహన కల్పించేందుకు ఐటీసీ మరియు ప్రథమ్ సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయా సంస్థల అధికారులు ఫుల్‌గా హాజరుకాగా అభ్యర్థులు మాత్రం అరకొరగా హాజరయ్యారు. మండల

కేంద్రమైన రాజానగరంలోని పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సుకు ప్రచార లోపం కారణంగా అటు చదువు మానేసిన విద్యార్థులు, మరోవైపు నిరుద్యోగులు హాజరు కాలేదని పలువురు పేర్కొన్నారు.దీంతో సదస్సుకు వచ్చిన ఆ నలుగురు తోనే సభ నిర్వహించారు. యువత ఉపాధి కోసం ఐటీసీ మరియు ప్రథమ్ సంయుక్తంగా,ప్రభుత్వాలు నేతృత్వం లో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సదస్సులో హెల్త్ కేర్, ఆటోమోటివ్,ఎలక్ట్రిషియన్,హాస్పిటాలిటీ,మల్టీ ఫంక్షనల్ ఆఫీస్ అసోసియేట్ ,వెల్డింగ్ రంగాల్లో రెండు నెలలు పాటు శిక్షణ అందించి తర్ఫీదు పొందిన అభ్యర్థులకు ఆయా రంగాల్లో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వస్తుంటే,ఇక్కడ మాత్రం అధికారులు అలసత్వంతో అభ్యర్థుల ఆశలపై నీరు చల్లుతున్నట్లుఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ బాబు మాట్లాడుతూ గ్రామంలో టంకు వేయడంతో పాటు గ్రామ వలంటీర్లతో ఇంటింటికీ ప్రచారం చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల మెంటర్లు రాజకుమార్, స్వాతి,సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

ఐశ్వర్య బియ్యంతో ఆరోగ్యం

విశాలాంధ్ర - రాజానగరం : ఐశ్వర్య బియ్యం తింటే ఆరోగ్యం మీ వెంటే ఉంటుందని శ్రీ ఐశ్వర్య ఫుడ్స్ ఇండస్ట్రీ బ్రాండ్ అంబాసిడర్,ప్రముఖ సినీ యాంకర్ సుమ కనకాల అన్నారు. మండలంలోని రాజానగరం సమీపంలో నూతనంగా శుక్రవారం ప్రారంభమైన శ్రీ ఐశ్వర్య ఫుడ్స్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుమ

మాట్లాడుతూ గతంలో వివిధ సంస్థలకు అంబాసిడర్ గా ప్రచారం చేసే ముందు తాను ఆయా సంస్థల వస్తువులు,సరుకులు కోసం పూర్తిగా తెలుసుకొని ప్రజలకు చెప్పేదానిని అని అయితే ఇక్కడ అందుకు భిన్నంగా ప్రజలే తనకు చెప్పారని అందుకే ఐశ్వర్య బియ్యం సంస్థకు అంబాసిడర్ గా ఉండడం జరిగిందన్నారు.సంస్థ చైర్మన్ జొన్నడ శ్రీధర్ మాట్లాడుతూ డయాబెటిక్ రహిత సమాజం నిర్మాణమే తమ సంస్థ లక్ష్యమని చెప్పారు.తన కుటుంబంలో జరిగిన యదార్థ సంఘటనలను వివరించారు.తమ సంస్థల ఆధ్వర్యంలో వివిధ వ్యాపారాలు ఉన్నాయనీ,అయితే అన్నం పరబ్రహ్మ స్వరూపం కాబట్టి కేవలం సామాజిక బాధ్యత తోనే దప్పుడు బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'వికాస' కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళ

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈ నెల 06వ తేదీ సోమవారం "జాబ్మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబేళాలో భావిక్రియేషన్స్ కంపెనీలో గ్రాఫిక్ డిజైనర్, వెబ్ డెవలపర్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, సోషల్ మిడియా, మార్కెటింగ్ ఫీల్డ్ స్టాఫ్, ఇంటర్న్షిప్, ఎస్ఇఒ, కాంటెంట్ రైటర్స్ టెక్ మహీంద్రా కంపెనీలో బిపిఒ, ఇజిఒ డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ(ప్రొడక్షన్), సోలారా యాక్టివ్ ఫార్మాసైన్సెస్లో ప్రొడక్షన్ టెక్నిషియన్, రిలయన్స్ రిటైల్లో పికింగ్ & ప్యాకింగ్, శ్రీకాళహస్తి పైప్స్ లి, ఇండో ఎంఎం కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో & ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000 నుండి రూ. 20,000 వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 06వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్ హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్: 7799376333 సంప్రదించవలెను.

సత్యదీక్షా భక్తులకు దీక్షా వస్త్రములు అందజేత

విశాలాంధ్ర - కిర్లంపూడి : అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్, పాలక మండల సభ్యులు ఆదేశాల మేరకు బూరుగుపూడి గ్రామంలో సత్యదీక్ష తీసుకునే భక్తులకు దీక్షా వస్త్రములు, మాలాధారణం, స్వామివారి ఫోటోతో పాటు పూజా పుస్తకం భక్తులకి అందజేశామని సత్య దీక్షా ప్రచారకర్త కృష్ణబాబు తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి. భక్తులకు సత్యదీక్ష గురించి వివరించి జీవితంలో ఒక్కసారైనా స్వామి వారి మాల ధరించండి అని భక్తులకి ప్రచారం ద్వారా సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు తెలియజేశారు. దీక్ష నియమాలు 27 రోజులు. 07.11.23 నుండి సత్యదీక్షల ధరించాలని 18 రోజుల దీక్ష కూడా ఉన్నాయని కృష్ణ బాబు తెలిపారు. సత్యదీక్ష ధరించడం వల్ల బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, త్రిమూర్తులు పూజ చేసిన ఫలితం దక్కుతాదని పవిత్రమైన కార్తీకమాసంలో స్వామి వారి గిరిప్రదక్షిణ తెప్పోత్సవం చూసే భాగ్యం కలుగుతాదని కృష్ణబాబు భక్తులకు తెలియజేశారు. సత్యదీక్ష ధరిస్తే స్వామివారి కృప మనకి ఎల్లప్పుడూ ఉంటుందని సత్యదీక్ష విలువని భక్తులకు వివరించరు. సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు భక్తులకు తెలియజేశారు. గెద్దనాపల్లి, తిరుమాలి పెద్దనాపల్లి, మలిసాల, జగ్గంపేట, కత్తిపూడి గ్రామాల భక్తులకు దీక్షా వస్త్రములు అందజేశారు.